తానా 2005

# అనివార్యం

జాతశ్రీ

**ఇరవై దాకా గుడిసెలున్న ఆ పాకీ వీధికి – ఓ అర గంట ముందే ఆరడుగుల పేము లాఠీలూపుతూ, అర డజను మంది స్పెషల్ పోలీసులొచ్చి, పెద్దవీరంగమాడి, పోతూ పోతూ ... 'బతికుండాలనుకుంటే మీ కొడుకుల్ని బయట తిరగనీయకండి' అని అర్థం వచ్చేలా ఏవేవో హెచ్చరికలు చేసిపోయారు.**



అంతే!

పంచభూతాల ప్రళయాగ్నులకయినా బెదరని, చెదరని ఆ వీధి జనం పోలీసుల వీరంగాలకు విహ్వాలులైపోయారు. నిముషాల్లో వీధి నిర్మానుష్యమైపోయింది. మెడలు సారించి, గూళ్లలో దూరే కోడిపిల్లల్లా – జనం గుట్టుచప్పుడు కాకుండా, తమ తమ గుడిసెల్లో దూరిపోయారు. కొందరైతే అప్పుడే తడికలో, తలుపులో బిగించేసుకొన్నారు.

ఉద్యోగంకోసం తిరిగీ, తిరిగీ... విసిగి వేసారిన నిరుద్యోగి మొహంలా – వెలుగు వెలవెలబోతున్న వేళ!

అన్నిరకాల నీతుల్ని తనలో విలీనం చేసుకొని, రాటుదేలిన అవినీతిలా – చీకటి నిస్సిగ్గుగా వయ్యారాల్ని ఒలకబోస్తూంది!

వీధి చివరనున్న గుడిసె వసారాలో గోడకు చేరగిలబడి, బుజాలు గోక్కునే లాల్‌పాసి మొహంలో ఏ భావం కదలాడుతుందో తెలియడం లేదు. అతను గుండె చెదిరినట్టుగా కాకుండా, నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నాడు.

లాల్‌పాసి భార్య తుల్సీబాయి మాత్రం అలా ఉండలేక, గుడిసెలోకీ, వీధిలోకీ కాలుగాలిన పిల్లికూనలా, అటూఇటూ తిరుగుతోంది. ఆమె మనో స్రవంతిలో భయం బుడగలు కదులుతూ పగిలిపోతున్నాయి. కన్నుల్లో కలవరం పోటెత్తుతోంది. చీకటి చీల్చేందుకు కళ్లు చిట్లిస్తూ, ఆమె దారిపొడవునా పదేపదే చూస్తోంది. పొద్దుపొద్దునే వరంగల్ పోయిన కొడుకు – యింకా రానందుకు, ఆమె అభద్రతా భావనలకు లోనై... అపశకునపు ఆలోచనల ఇరకాటంలో ఇరుక్కుపోతూంది.

"బువ్వన్న బుక్కలె కొడుకు, యాడ దిరుగుతుండో... ఆ మాయదారి ఉజ్జోగం అచ్చింది గాదు, సచ్చింది గాదు! ఆ పేర్న పిలగాడు పిట్టలెక్కన తిరుగుతాండు. పనుల్లేక బతకలేక పోతున్నవంటే, సెవిబెట్టేటోడు లేడుగానీ... గదే,

పాణాలు కుమ్మేయడానికయితే, పుట్టగొడుగుల్లాగ పుట్టకస్తరు..'' లోస్వరంతో తనకు తానే చెప్పుకొని, బుజాలు గోక్కునే భర్తకేసి, 'కొరకాసు'లా చూస్తూ, ''అట్ట మొద్దోలె కూకోకుంటే, కాత్త పిలగాడి జాడకు పోరాదూ?'' అంది.

గోకుడాపి, గుడ్లెళ్లబెడుతూ, ''ఆడేవన్న పసిపోరడానె! ఎదురెల్లి ఎత్తకరావటానికి? ... ఆడే అస్తడు, నువ్ గమ్మునుండు'' అన్నాడు లాల్‌పాసి.

''గమ్మునుండక, నీ గొంతేవన్న 'గావు' బద్తన్ననా?''

''చత్, అరవక'' లాల్‌పాసి ఈసడింపుగా కసిరాడు.

అలా కసరడాన్ని తుల్సీబాయి ససేమిరా అంగీకరించదు. మొహాన్ని కందగడ్డలా మార్చుకొని, ''ఏం దట్ట రెచ్చిపోతన్నవ్... నేనిప్పుడేవన్న, పిలగాడి జాడకి పొమ్మన్ననే గాని, అసిద్ధవేఁదన్న కూసిన్నా?... మాలావు అంటున్నవ్, నేనూ మన్సినే... సీవూఁ, నెత్తురున్న దాన్నే, కసిరి...''

''మమ్మగ అరవబాకే?''

''అరిత్తే వొరిగేదేందిలే తియ్, పోరణ్ణి పూరా పాడుజేస్తివిగా... ఆ మాయదారి సదువు పున్నెన, ఆడి బతుకే బుగ్గిన బడ్డట్టయింది. ఆణ్ణి బడికి పంపవాఁకంటే యినిసత్తివా?... 'నా కొడుకు కలెకటేరయితడే ఎ(ర్రిముండా...' అని ఎగసికవాఁడ్తివి... యిప్పుడే వాఁయె!''

''ఆణ్ణి బడికి పంపటవేఁ బాడుకావు పనంటవ్?'' – లాల్‌పాసి.

''కాదేం మరి, అటు సిన్న పాటి ఉజ్జోగవన్నా దొరక్క పాయె! ఇటు కులం పనికీ కొరగాకుండయి పాయె... మూడేళ్ళాయె, కొడుకు కుడితిన బడ్డ ఎలకపిల్ల తీర్న కొట్టుక సస్తాండు'' – తుల్సీబాయి.

''కులం పని జేసుకుంటనంటె, కాదన్న మాదర్చదోడెవడు?''

''మళ్ల – గదే కూత! ... ఎన్ని మాట్లు సెప్పాల, ఆడా పని సెయ్యనని మొరాయిస్తుంటే నీక్కాదూ?''

''సెయ్యక, గుటకాలు బొక్కుంట బజారు పొంటె బాగోతాలాడవను... ఉజ్జోగం పేర్జెప్పి, ఎన్నెన్ని రూపాయలు దెంకపోతాండో నీకెరకలే... మూడేళ్ళ సంది రికంగ తిరగటవేఁ తప్ప, నికరంగేదన్న పన్జేసి, 'ఇగ్గో పా యీ పావలా..' అని, యిచ్చిండా? మీసాలు రాంగనే మొగోడ్డైపోడు. సింతాకంత పన్జేసి, పది రూపాయలు కళ్లజూడాల. అదీ తెలివున్నోడి వర్స... ఆఁ...'' అన్నాడు లాల్‌పాసి.

''ఆడేం రికాంగ తిరగటంలే... ఆ వొరంగల్లాయన ఏడాది సంది మురిపిస్తాండు గాదూ... రేపురా, మాపురా... అంటుంటే, కొడుకు నమ్మి తిరుగుతాండు. తప్పా?... అయినా ఆడు కులంపని దప్ప యింకేదన్న పనికి సైయన్నడు గాదె!''

కుందేలుకు నాలుగు కాళ్లని చెపితే నమ్మని మనిషితో యింతకాలం తానెలా నెట్టుకొచ్చాననే ఆశ్చర్యంతో తల గీక్కుంటూ... తుల్సీబాయీ – ఎవరి కోణం వారిది! ఎవర్నీ తప్పుపట్టేందుకు లేదు. అధవా – ఎవరేని తప్పు పట్టాలనుకొన్నా, ఆ దంపతులిద్దరూ ఏకమై – ఒకే మాటగా పోటెత్తి విరుచుకపడతారని తెలియని వారు – ఆ వీధికి కొత్త వాళ్లో, పసిపిల్లలో కావాలి!

''అంటే... ఉజ్జోగం ఊడిపడుద్దానె? ఉజ్జోగాలిచ్చోడు లేకనేగా, ... పోరగాళ్లకు పోకిరెవారాలకీ, తప్పుడు పన్లకీ ఎగబడుతుౖను? ఆడికి సుత తెల్వదా? ... అయినా.. కులం పనంటే అంత సులకనేంది? తాతల్నుంచి సెయ్యటంలే?''

''పోనీలే.. సదూకున్నోడాయె! సిన్నతనంగుందేవోఁ ... కాలం ఎనకటితీర్నుందా.... మార్లే?''

''అయితే, ఆవాఁలీ పనికి కుదుర్తడేవోఁ అడిగి సూడూ''

''వామ్మో... ఆ బస్తాలు ఆడు మోస్తడా? ఆడికి మీసకట్టన్న సరిగరాలె! లేత బొక్క.. ఇర్సక పడ్డడో ... కొడుకు సేతికందడు'' అంది తుల్సీబాయి.

''తేరగదీ దొరకటం లేదులే... ఆ పనీ ఏలకెయిలు బెట్టి కొనాల్నొస్తంది. పోనీ, సుతారి పనికి పోతడేవోఁ...''

''సాల్లే సంబడం.. ఆడు సదివిన సదువేంది, నువ్ జెప్పే పనేంది?''

''నీతో మా సిక్కొస్తాందే.. నిను మెప్పియ్యడం నావల్ల గాదికి! ఇగ నే పొమ్మనుంట. నీకెట్ట దోస్తే అట్టగానియ్'' అని వీధిలోకి లాల్‌పాసి అడుగేస్తుంటే, తుల్సీబాయి మొహాన పేలాలేగిస్తూ, ''అగ్గో... జారుకుంటున్నవ? ఏదీ సివరంటా సాగనియ్యవుగా? కొడుక్కేదో దారి సూడాల్నా, లేదా?...'' అంది.

''ఏంది సూసేది? ... తల్లా, ఏ సుక్కపొద్దు పుట్టినవోగాని, వామ్మో... నిను గన్నోడికి మొక్కాలె... నా ముచ్చటేందో యినకుంటనే మెలకేస్తవ్'' అని, వీధిలోకి నడిచాడు లాల్‌పాసి.

సమస్యనిలా మధ్యలో వదిలేసి జారుకోవడం లాల్‌పాసికి యివాళేం కొత్తకాదు. పెళ్లయిన నాటి నుంచీ వున్నదే! చివరకు చూసీ చూసీ విసుగెత్తిన తుల్సీబాయి తనకు నచ్చిన రీతిలో సమస్యను పరిష్కరించుకోవడమూ పరిపాటే!

కుందేలుకు 'మూడున్నొక్క కాళ్ల'ని చెపితే, కాదని రెట్టించే మనిషితో ఎట్టేగాల్నో తెలీక తల గోక్కుంటూ... లాల్‌పాసీ –

కుందేలుకు నాలుగు కాళ్లని చెపితే నమ్మని మనిషితో యింతకాలం తానెలా నెట్టుకొచ్చాననే ఆశ్చర్యంతో తల గీక్కుంటూ... తుల్సీబాయీ –

– ఎవరి కోణం వారిది! ఎవర్నీ తప్పుపట్టేందుకు లేదు. అధవా – ఎవరేని తప్పు పట్టాలనుకొన్నా, ఆ దంపతులిద్దరూ ఏకమై – ఒకే మాటగా పోటెత్తి విరుచుకపడతారని తెలియనివారు – ఆ వీధికి కొత్త వాళ్లో, పసిపిల్లలో కావాలి!

వీధిలోకొచ్చిన లాల్‌పాసి చుట్టూ చూశాడు. చీకటి నిశ్శబ్దంగా నిలుచుంది. మనిషి జాడ మచ్చుకయినా లేదు. అతని శరీరం జలదరించినట్లనిపించింది. అనాలోచితంగా మదిలో కొడుకు నీడ కదలాడింది. అలలా హృదిలో ఓ అలజడి!

''నిజంగానే... ఈడింకా రాలేందబ్బా?'' అనుకుంటూనే భయం కెలకేసింది. 'ఒకవేళ అలా...' – గతంలో అనుభవానికొచ్చిన ఓ సంఘటన గుర్తొచ్చి, ఆదుర్దాపడిపోయాడు. అతని అడుగులు వీధి దాటి రోడ్‌పై సాగి, అంబేద్కర్ సెంటర్ మలుపున ఆగిపోయాయి.

రోడ్ పొడవునా విద్యుద్దీపాలు – కిరోసినీదీపాల్లా వెలుగుతున్నాయి. రోడ్ అస్పష్టంగా – నిరుద్యోగి భవిష్యత్‌లా వుంది. చీకటి – వెలుగును ఎన్‌కౌంటర్ చేయాలని శతథా ప్రయత్నిస్తూంది. పక్కనే వున్న రాయి మీద నిల్చొని లాల్‌పాసి కళ్లకడ్డంగా అరచేతినుంచి, దూరంలో చూడసాగాడు. అడపాదడపా వస్తున్న వాళ్ళలో తన కొడుకు కనిపించక, అతని భావనా స్రవంతి భయం వాకిళ్లకేసి దూసుకుపోతోంది. సైకిలొకటి మలుపు తిరిగి తనకేసి వస్తుంటే రాయి దిగి రెండడుగులేసి, ''ఎవ(డబ్బాయీ?'' అన్నాడు కళ్లు చిట్లిస్తూ.

''నేనే బాబాయ్'' అతను సైకిల్ దిగాడు.

తమ యిళ్లలో పిల్లోడే! కొద్దిగా చదువుకున్నాడు కూడా. గత రెండేళ్లు ఓ కంట్రాక్టర్ దగ్గర వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేశాడు. మూడు నెలల క్రితం దొంగతనం జరిగిందనే నెపంతో జీతం యివ్వకుండానే వెళ్లగొట్టారు. ప్రస్తుతం శ్రీ సాయిసుధా రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పనిచేస్తూ చాలీచలని జీతానికితోడు టిప్పులడుక్కొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

''మావోడు కనబడ్డాడ్రా అబ్బాయ్''

అతను దగ్గరగా వచ్చి, స్వరం తగ్గించి ''తెల్వదా... మీవోడ్నీ, ఆ తలారయ్య మనవఁడు రామజోగినీ పోలీసోళ్లు స్టేషన్‌ల కూచోబెట్టిౖనుగా...'' అన్నాడు.

లాల్‌పాసి ఉలిక్కిపడి ''ఎందుకూ?'' అన్నాడు బెరుగ్గా చూస్తూ.

ఏవోఁ మరి... స్టేషన్ దార్లె పోలీసోళ్లు తుపాకులతో నిలబడి, వచ్చిపొయ్యే పడుచుపడుచోల్లందర్నీ – ఆడామగా చూడకుండా ఆపుచేసి పేర్లుగట్ట రాస్కొని, వెల్లగొడ్తౖను గాదూ?''

''చత్, పోరగాళ్లు సదువులు సదివీ ఉజ్జోగాల్లేక, రోడ్లెంట పిచ్చికుక్కల్లెక్కన తిరిగి సస్తావుంటే పైపెచ్చు యిదోటా... మావోడేం జేసిండంట?''

''వరంగల్ పొయిండుగా!''

''వొరంగల్ పోతే... ఆడేదో బతుకుదెరువు పని కోసం పొయిండుగాని, దొంగతనాలకి పొయిండా?''

''వరంగల్ కాడ అన్నల సభ పెట్టలే... ఆ సభ కాడ పోలీసోళ్లు పొటోలు తీస్తంటే ఏదో గలాటా జరిగిందంట. దాంతో పోలీసోళ్లకి తిక్కరేగింది.... ఊకుంటరేంది?'' అని సైకిలెక్కాడతను.

లాల్‌పాసి తేలగుడ్లేసి పోతున్నతన్ని చూస్తుండిపోయాడు. మనసంతా గజిబిజిగా వుంది. గుండె తడబడుతున్నట్టనిపించి, నిలుచున్న రాయి మీదనే కూలబడిపోయాడు. చాలాసేపటిగ్గానీ అతనిలో

కదలిక రాలేదు. పరుగెత్తుకెళ్లి భార్యకు చెప్పాలనిపించింది. రెండడుగులు వేశాడు కూడా. అంతలోనే ఆగి, భార్యవేసే తిరకాసు ప్రశ్నలకు జవాబులు చెప్పలేక, చిరాకుపడితే... అదికాస్తా తగువుగా మారి తల బొప్పికట్టిస్తుందనిపించి, వెనుదిరిగి సరాసరి స్టేషన్‌కేసి చెకచెకా అడుగులేశాడు.

అతని అడుగుల్లానే ఆలోచనలూ నడుస్తున్నాయి. కొడుకు బతుకు ఏ మలుపు తిరుగుతుందో అంతుచిక్కడం లేదు. ఆలోచనలూ ఆగడం లేదు.

తానెంత హీనంగా, దీనంగా, దరిద్రంగా బతికినా – తన కొడుకయినా మంచి బతుకు దర్జాగా బతకాలని ఎంతగా ఆరాటపడ్డాడు? ఎందరు!... ఆఖరికి భార్య మాటనీ కాదని, దూరం పంపించి చదివించాడు. 'మరుగుకుప్పలెత్తి పారబోసే పాకోళ్లకి చదువెందుకని వెక్కిరించినవాళ్లని లెక్కచేయకుండా ముందుకు నడిచాడు. కొడుకు ఉద్యోగం చేస్తూ మల్లెపూల్లాంటి గుడ్డలేసుకొని నలుగురిలో తిరుగుతుంటే.... కులపోళ్లందరూ తనను గొప్పోడిగా చూస్తారని ఊహించుకుంటూ, కష్టాల్ని కమ్మగా భరించాడు. కొడుకు అడిగీ అడగక ముందే అప్పుజేసి మరీ డబ్బులిచ్చాడు. ఆ వడ్డీలకోసం తన జీతంలో సగం కోత పడినా, అదంతా – ముందుముందు తానునుభవించే సుఖాలకీ, గౌరవాలకీ పెట్టుబడిగా నమ్మి మురిసిపోయాడే తప్ప – ఏనాడూ బాధపడిందీ, చిరాకు పడిందీ లేదు.

రాంపాసి బి.కాం. పాసైన రోజు లాల్‌పాసికి పండుగలా అనిపించింది. తన బంధువుల్లో గానీ, కులపోళ్లలో గానీ, అపాటి చదువు చదివిన వారెవరూ లేనందున, తాను మాత్రమే గొప్ప కార్యాన్ని సాధించినట్టు, పాకీవాళ్ల బతుకుల్ని మలుపు తిప్పినట్టు పొంగిపోయాడు. కొడుకు ఉద్యోగం చేస్తుంటే, దొరలా పొరచుట్ట తాక్కుంట బతకొచ్చని... తీయని అనుభూతి – అతని అణువణువునా చేరి, ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

అయితే –

రోజులు గడిచేకొలదీ గత అనుభూతికీ – వాస్తవానికీ మధ్య పూడ్చలేని అగాధమున్నట్టు, రెండేళ్ల అనుభవాలతో తెలిసొచ్చాక, రాంపాసికి ఉద్యోగం దొరకదని నిశ్చయంతో నీరసపడి... ఏడాదిగా కనీసంగా బతకడానికి కులవృత్తినో, మరో వృత్తినో ఎంచుకోమని అతను రాంపాసి చెవిలో బాధపడుతూనే చెప్పక తప్పడంలేదు.

తుల్సీబాయి కూడా చాలా రోజులుగా తల్లడిల్లిపోతూంది. పదుగురిలో తాను పలచనైనట్టు, న్యూనతాభావ ధోరణితో బతుకుతుందామె. వీలయినప్పుడల్లా కొడుకును దగ్గరగా తీసుకొని, "కొడకా, ఎట్లా బతికేది ఎవరూ చూడరు. ఎట్టాగైనా బతుకుతున్నా, లేదా అనేదే చూస్తరు. ఏదన్న సింతాకంత పన్జూసుకో.... ఏదన్న పని... మనవనుకున్నయన్నీ అనుకున్నట్టే జరిగితే, మరా బగమంతుడనుకునేఁయి ఏంగావాల?... ఏదైనా మన మంచికే అనుకుంటేనే మంచిగుంటది. దొరికిన పనేదో సేసుకుంట, ఉడకేసుకున్నదేదో తినుకుంట, గమ్మునుంటే సాలు..." అని పదేపదే చెప్పడంతో రాంపాసి కూడా ప్రభుత్వోద్యోగం మీద ఆశ చంపుకుని, వరంగల్‌లో ఏ ఫ్యాక్టరీలోనైనా ఏదైనా... మోటు పనైనా చేసేందుకు సిద్ధపడి తిరుగుతున్నాడు.

ఒకరిద్దరు నాయకుల్ని కలిసి అడిగితే, చిటికలేసి, ఊరించి... 'రేపు రా, మాపురా' అని తిప్పుకోవడమే తప్ప అసలు సంగతి వాళ్లు చెప్పడమూ లేదు, రాంపాసి పసిగట్టడమూ లేదు. ఓ పదివేలుంటే పనౌతుందని ఒకరిద్దరు చెప్పినా, అసలు నాయకుల నోటినుంచి ఆ మాట రానందుకు ప్రతిరోజూ వరం



## బాయ్‌ఫ్రెండ్ ఉంటేనే...

వర్షాకాలంలో బాయ్‌ఫ్రెండ్ పక్కన లేకుండా ఎక్కడికీ వెళ్లదట కరిష్మా టన్నా. 'క్యూంకి సాస్ బీ బహూథీ' సీరియల్‌లో ఇందూ పాత్రలో అందరికీ పరిచయమైన కరిష్మాకి డ్రెస్ సెన్స్ ఎక్కువ. డెనిమ్స్ అంటే ఎక్కువ ఇష్టం. చెవి రింగులంటే ఎలర్జీ. వర్షాకాలం వేడివేడి టీ తాగుతూ బాయ్‌ఫ్రెండ్‌తో కబుర్లు చెబుతూ వుంటే ఆ మజానే వేరట! ఒళ్ళు దాచుకోకుండా నటించే ఈ అమ్మాయి బాలీవుడ్‌లో ట్రై చేస్తూ వుంది.

గల్ పోతూ, వస్తూ.. నాయకుల చుట్టూ, ఫ్యాక్టరీల చుట్టూ తిరుగుతూ... ఎంత తిరిగినా – రాంపాసికి చిన్నపాటి పనంటూ దొరకలేదు గాని – రకరకాల అనుభవాలు, కొత్తకొత్త ఆలోచనలు, సరికొత్త పరిచయాలు దొరికాయి.

ఆ అనుభవాలు – అతనికి వ్యవస్థ తీరుతెన్నుల్ని అవగతం చేశాయి!

ఆ ఆలోచనలు – అతన్ని నూతన లక్ష్యాలవేపు నడిపించాయి!!

ఆ పరిచయాలు – అతన్ని ఉన్నత సమాజ కోణాలకోసం పరితపించేలా మార్చాయి!!

తానాశించిన, నిజమైన ప్రశాంత జీవితం తనకూ, తనలాంటి పేదలకు అందుబాటులోకి రావడానికి వున్న అడ్డంకుల్ని గుర్తించిన కొలదీ... అతనికా అడ్డంకుల మీది కసి!

తననూ, తనలాంటి నిరుద్యోగుల్ని మోసగిస్తున్న విధానాల మీద కసి!

రోజులు గడిచేకొలదీ – అతనికందిన పుస్తకాల అధ్యయనం ద్వారా అతనిలో గూడుకట్టుకొన్న కసికి – పిలకలూ, మొలకలూ పుట్టుకొస్తుంటే... రాంపాసి భావనా ప్రపంచంలో సాధారణ వ్యక్తులు ఊహించనంతగా – మార్పులు!

భూమిని పిడికిటబట్టిన వాళ్లనీ, డబ్బుకు నలుపు రంగేసిన వాళ్లనీ, అవినీతి అందలంలో ఎక్కి నక్కిన వాళ్లనీ... లాగి, కసికసిగా నలిపేయాలన్నంత కసి!

రాంపాసిలోని కసిని లాల్‌పాసి పసిగట్టలేకపోయాడు. అంతేకాదు, ఆ కసిని పోలీసులు పసిగట్టారనీ – పసిగట్టలేకపోయాడు!

''పా...''

తలొంచుకు నడిచే లాల్‌పాసి ఉలిక్కిపడ్డాడు. తలెత్తి స్థాణువులా నిల్చుండిపోయాడు.

ఎదురొస్తూ... తలారయ్య మనుమడు రామజోగితోపాటు రాంపాసి!

''యాడికి పా, చీకట్లో..'' రాంపాసి తండ్రిని 'పా' అని పిలుస్తాడు. చిన్నప్పుడు తమ ఇంటి పక్కనున్న పరదేశీ కుటుంబీకుల పిల్లల స్నేహంతో అబ్బిన అలవాటది.

''నీకోసమే... ఇంతాలిసెమైందేం?''

అందుకు జవాబివ్వకుండా, ''పద, అమ్మ భయపడుతున్నాల'' అన్నాడు రాంపాసి.

నింపాదిగా కొడుకును గమనించాడు లాల్‌పాసి. అతని నడక మామూలుగా లేదు. రాంపాసి పక్కన నడిచే రామజోగి నడకలోనూ ఆ 'నొప్పి'ని గుర్తించాడు.

''ఏమయింద్రా జోగీ?'' వారి వెనుక నడుస్తూ లాల్‌పాసి, రామజోగి చేతిని తాకుతూ నెమ్మదిగా అన్నాడు.

రామజోగి వెంటనే నోరిప్పలేదు. ఉద్వేగంతో అతని లోప్రపంచం ఉడికిపోతూంది.

''చెప్పవేంద్రా జోగీ, పోలీసోళ్లు ఎందుకాపుజేసిన్రు...కొట్టిన్రు కదూ?''

రామజోగి అంతరంగంలో అసహనం కదలాడింది. పక్కన నడిచే రాంపాసి చేతిని నొక్కి, లాల్‌పాసి కేసి బాధగా చూస్తూ ''ఈ పోలీసోళ్ళు మమ్మల్ని బతకనియ్యరు మావాఁ... ఎవురికేదన్న సెప్పటవూఁ తప్పే! సెప్పేది యినటవూ తప్పేనా?... సిన్నపాటి ఉజ్జోగం దొరక్క అల్లల్లాడతన్నవే? మా మొరెవురింటున్రు... మా ఎంబడి ఏడిపిస్తున్రే... మేవేం జేసినం? ఎవరి మీద గుండాయిజం సేసినం? ఎవురి కంచంల కూడు లాక్కొని తింటున్నం? ఏం తప్పు జేసినవని మమ్మల్నిలా కుల్లబొడుస్తున్రో తెల్వటం లేదు మావాఁ'' గాద్గద్యంగా అన్నాడు రామజోగి.

''ఈ పోలీసోళ్ళు మమ్మల్ని బతకనియ్యరు మావాఁ... ఎవురికేదన్న సెప్పటవూఁ తప్పే! సెప్పేది యినటవూ తప్పేనా?... సిన్నపాటి ఉజ్జోగం దొరక్క అల్లల్లాడ తన్నవే? మా మొరెవురింటున్రు... మా ఎంబడి ఏడిపిస్తున్రే... మేవేం జేసినం? ఎవరి మీద గుండాయిజం సేసినం? ఎవురి కంచంల కూడు లాక్కొని తింటున్నం? ఏం తప్పు జేసినవని మమ్మల్నిలా కుల్లబొడుస్తున్రో తెల్వటం లేదు మావాఁ''

లాల్‌పాసి దగ్గర జవాబు లేక నోరు పెగల్లేదు. రామజోగి బుజాన చెయ్యేస్తూ, దగ్గరగా తీసుకున్నాడు.

రామజోగి గుండెల్లో పేరుకుపోయిన బాధను తగ్గించుకునేందుకు, మళ్ళీ ''పడుసోడె వడైనా బజారు పొంటె కనబడితె పాపం... పనిలేక, ఆకలిని ఎలా చంపుకోవాలో తెలీక, అయినోళ్లకి మొహం చూపలేక, బయట తిరుగుతవేఁ తప్ప, ఎవడ్నో, ఏదో సెయ్యాలని కాదుగా! పిచ్చోడిలాగ తిరిగోడ్ని పట్టుకుని, ''యాడికి బోతన్నవ్? ఎందుకు బోతన్నవ్? యాడ్నుంచొస్తన్నవ్? పేరేంది, ఊరేంది? అనటం... సెపుతున్నా యినకుంట తన్నుకుంట జీపులకి తోసెయ్యటం?... మాదేం బతుకు మావాఁ... పనిలేనోళ్ళ వనేగా యీ పలచదనం! ... యీ బతుకు బతికే కంటే...'' అంటున్న రామజోగి చేతిని గట్టిగా నొక్కాడు రాంపాసి. లాల్‌పాసి గమనించలేదు.

పిల్లల్ని అకారణంగా హింసించినందుకు లాల్‌పాసి ఆవేశంతో ఊగిపోయాడు. పళ్లు కరకరమన్నాయి. అతని ఆవేశం అదుపుదాటితే వణుకొస్తుంది. ఆ విషయం అతనికి తెలుసు! తన్ను తాను సంభాళించుకుంటూ ''కరమ రా జోగీ, కరమ... ఏ జల్మల మూటగట్టుకున్న పాపవోఁ యిలా ఎంటబడి ఏడిపిస్తాంది'' రామజోగితో కాకుండా తనకు తానే చెప్పుకొన్నట్టుగా గొణిగాడు.

పోలీస్ జీపొకటి హారన్ మోగిస్తూ, వాళ్ళ పక్కగా వచ్చి, క్షణం ఆగి, వికలాంగుల కాలనీకేసి దూసుకపోయింది. దానిలో వున్న పోలీసులు నవ్వుకొంటున్నారు.

''వేటకి వేళయింది'' లోలో కసి పెంచిన విరక్తితో రాంపాసి.

''ఎవుడికి మూడిందో!'' పైకి కాదు. లోలో అనుకొన్నాడు రామజోగి.

రాంపాసి – మౌనంగా నడుస్తున్నా, అతని మనసు మౌనంగా కాకుండా – ఆవేశపు ప్రకంపనల సంక్షోభం వలన ఎగసిన ఆలోచనల సునామీలా – ఉద్వేగపడిపోతుంది. పోలీసులు తమను స్టేషన్‌లో ఉంచినందుకు కాదు. లాఠీలు విరిగిందాకా హింసించినందుకూ కాదు. హింస మామూలే! ఎన్‌కౌంటర్స్ అధికారపు వృత్తీ, ప్రవృత్తిగా మారిన భయవిహ్వల వాతావరణంలో – నవ్వుతూ, ప్రశాంతంగా జీవించే అవకాశాలు తగ్గిపోవడం సహజమే!

కాని ఎందుకిలా?...

అభద్రతా భావోద్వేగాలకు జనం బలైపోయే ధోరణి రూపొందిస్తున్న శక్తులు ఆశించేదేమిటి?

ఏ స్వార్థంతో, ఏ అర్థంలో యీ హింస!

బతుకులోని రంగూ, రుచీ అందకుండా జేసి. తల్లిదండ్రుల ఆకాంక్షల్ని తీర్చడానికి చిన్న ఆధారం కూడా కల్పించలేని విధానకర్తలకు మమ్మల్ని శాసించే అధికారం ఎలా వుంటుంది?

జాతి జీవనాడిగా 'అహింస'ను పేర్కొంటూ – ఈ హింస ఏమిటి?

ఈ వైరుధ్యం ఏమిటి?

నిజాయితీగా బతికే అవకాశాలను తుడిచేసి, ప్రశాంతతను అశాంతికి లోనుచేసి, నియమ రహితమైన విశృంఖలతవైపు యువతను బలవంతంగా నెట్టి, ఆయుధాన్ని ఎక్కుపెట్టి...!?

కన్నీళ్ళే – మంచినీళ్ళుగా మార్చుకున్న నిరుద్యోగుల్ని మానసికంగా ముక్కలు చేసి, వారి ఆశల్నీ, అనుబంధాల్నీ, ఆరాటాల్నీ తొడగొట్టి – పడగొట్టి, ఆనందించే వైఖరిని నిరోధించకపోతే చస్తాం! నిరోధించితే చంపుతారు! ఎలానూ చావే... చస్తే ఏం మిగలదు. చంపబడితే కనీసం 'ప్రశ్న' మిగులుతుంది. ప్రశ్న – చైతన్యమై చిగురిస్తుంది!!

నా బతుక్కి అతికిన మాట, నా మనసుకు నచ్చిన పాట వినడమే నేరమైనచోట..., దారిద్ర్యాన్ని దిగమింగుతూ కలత నిద్రలోనున్న నిస్సహాయ, నిరుద్యోగ యువతను అనుమానించి, అపహరించి, అవమానించి, మాయంచేసే ఆనవాయితీకి అభినందనలు లభిస్తున్నచోట...

ఆలోచనలు ఎగసినవాడు...

ఎగసిన నాడు...

గుడిసె దగ్గరవుతూనే లాల్‌పాసి కొడుకుతో ఏదో చెప్పబోయాడుగాని, నోరు పెగల్లేదు.

రాంపాసి గమనించాడు. అల్లకల్లోలంగా వున్న తన అంతరంగాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ, తండ్రి చేతిని తన చేతుల్లోకి తీసుకుని, ప్రేమగా నిమురుతూ, ''ఏం కాలేదు పా... నాకేం కాలేదు. కాదు.. నేనేం తప్పు చేయడంలే...'' అన్నాడు.

అల్లంత దూరం నుంచే తుల్సీబాయి కొడుకును పోల్చుకుంది. అతన్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచారని ఆమెకు అంతకుముందే తెలిసి కంగారుపడిపోతూంది. ఎదురొచ్చి, తడుముతూ దగ్గరగా తీసుకొని, ''కొడకా, యాడబొయినవ్?'' అని, లోలో కుములుతూ కూనిరాగం తీస్తూ, చేయి పట్టుకొని

గుడిసెలోకి తీసుకుపోయింది.

లాల్‌పాసి వసారాలోనే ఆగి, ''జోతీ, అన్న ఉడుకు నీళ్ళు పోసుకుంటడు. నీళ్ల సర్వ పొయ్యి నుంచు'' బిడ్డకు వినపడేలా అని, అదే స్థాయిలో ''నువ్ ఆ కూనిరాగం కట్టెయ్, జనం లేత్తే అదో పీకు లాట''. ఏడుస్తున్న భార్యను ఊరడిస్తున్నట్టుగా కాక, గదమాయిస్తున్నట్టుగా అని, గోడకు చేరగిల బడి, కునుకులోకి జారుకుందామని ప్రయత్నం చేశాడు. మౌనం అతని మనసును కుదుపుతోంది. ఎంత కాదనుకున్నా... ఏవేవో ఆలోచనలు!

ఒకే వొక్క ఆశతో... తాను ఎన్నెన్ని రీతుల బాధ లనో దిగమింగుతూ – కొడుకును చదివించుకు న్నాడు. తాను చేస్తున్నట్టు పాకీ పని కాకుండా వాడు నలుగురితో సమానంగా తిరిగే ఉద్యోగం చేస్తూ గొప్పగా బతకాలనే ఒకే వొక్క ఆశతో...

తాను ఉదయాన్నే మలం బక్కీటులో చీపురుకట్టా, రేకు ముక్కా ఉంచుకొని, ఇల్లిల్లూ తిరుగుతూ, మరుగు దొడ్లలోని మలం కుప్పల్ని రేకులో ఎత్తి, మలం బక్కీటులో వేసి, దాన్నోపక్కనుంచి, ఫినాయిల్‌తో దొడ్డిని కడిగి, ఈగలూ, పురుగులూ చేరకుండా బూడిదో, ముగ్గో చల్లి, మలం బక్కీటును నెత్తినుంచుకొని, ఊరికి దూరంగా పారబోసే వృత్తి చేస్తూ కూడా ... శక్తి లేకపోయినా, నలుగురు నవ్వినా చదివించుకొన్నది – ఆ ఒకేఒక్క ఆశతోనేగదా!

పాకీవృత్తిలో మార్పులొచ్చి, మలాన్ని ఎత్తి పారబోసే పద్ధతయిపోయి, రూపాంతరం చెందించే పద్ధతి (సెప్టిక్ టాంకుల పద్ధతి) వచ్చా కూడా, అదే వృత్తిని కొనసాగిస్తూ, ఉదయాన్నే ఊరంతా తిరుగుతూ, మురుగు కాల్వల్ని శుభ్రం చేయడం, సెప్టిక్ ట్యాంకు కాలువల్లో ఏ తట్టూ లేకుండా జంక్షన్‌ల దగ్గర సరిచెయ్యడం, నిండిపోయిన టాంకుల్లోని విసర్జితాన్ని ఎత్తి దూరంగా పోయడం... యిదంతా ఎవరికోసం? వృత్తిధర్మంగా తాను చేసిన పనులను బట్టి సమాజం తనను హీనంగా, అంటరానివానిగా చూడటం – బాధాకరంగా అన్పించినా భరించిందెందుకోసం? చేసే వృత్తిని బట్టి కాక, గుణాన్ని బట్టే మనిషికి ఆనందం మిగులుతుందని నమ్మి, 'పనిని గౌరవిస్తూ' పడిన కష్టాలకు ఫలితం అందకపోవడంతో... అతనికి సమాజం మీద కాదు, తన మీద తనకే అసంతృప్తిగా ఉంది. తానాశించిన దానికి భిన్నంగా జరుగుతున్నందుకు, తన బతుకు వంకర తిరిగి తననే వెక్కిరిస్తున్నందుకు, అతని మనో లోకం కుదుపుల పాలై అతలాకుతలమైపోతోంది.

గుడిసెలో తుల్సీబాయి కూనిరాగం ఆగిపోయింది. భర్త ఆపమన్నాడని కాదు. కొడుకుకు ఉన్నదేదో వండిపెట్టుకొందామని ఆపి, ఆ పనిలో పడింది.

రాంపాసి బుజానున్న సంచి తీసి మంచంకోడుకు తగిలించి ''జోతీ, మంచినీళ్ళు'' అని, మంచంలో వొరిగాడు.

నీళ్లసర్వ పొయ్యిమీదుంచి, మంట రాజేస్తున్న జోతీబాయి లేచి, లోటాతో అన్నకు నీళ్లందించి, అతను తాగాక, లోటా అందుకొంటూ, ''ఆర్నెల్ల సంది సూస్తన్న, పోలీసోళ్లు రోజూ నీ జాడకొస్తరేంది?... నీ ఎనడ పడ్డరెందుకూ?...'' అంది అమాయకంగా చూస్తూ.

రాంపాసి జాలిగా చెల్లెలికేసి చూశాడు. విరక్తి నిండిన ఓ 'నవ్వు-ముక్క' అతని పెదాలపై విరిగి పడింది. ''నిరుద్యోగిని కదమ్మా... అందుకు'' అన్నాడు.

''ఐతే...''

''నిరుద్యోగులకి ఆకలుండకూడదు. కళ్లుండకూడదు. నోరుండకూడదు. ఉంటే ... ఇదిగో ... ఇలానే ఉంటది''




''తెల్వటంలే...''

''నీకిప్పుడిప్పుడే తెల్వదులే''

జోతిబాయికి తిక్కరేగింది. లోటా తిరగేసి, అన్న మొహం పగిలేలా, ఈడ్చి కొట్టాలనిపించింది. 'ఎవరికైనా చెపితేనే గదా, తెలిసేది... దాటేసి తెల్వదంటే ఎలా?' లోలో గొణుక్కొని, ''ఛత్, నువ్వెప్పుడూ యింతే, ఏదీ గుండె విప్పి చెప్పవుగా!..'' నిష్టురంగా చూస్తూ అని, పొయ్యి దగ్గరకెళ్లింది.

రాంపాసి స్నానం చేసి వచ్చాక, తుల్సీబాయి అన్నం కంచాన్ని అతని ముందుంచి దగ్గరగా కూచొని 'అదోలా' చూసింది.

తల్లి అదోలా చూసిందింటే రాంపాసి కసి నక్కిళ్లు పడతాయి. ఆ 'అదోలా'లో ఉన్న ఆరాటమూ, ఆకాంక్షా అతనికి తెలుసు. ఆమెలో చాలా... చాలా కాలంగా కొనసాగుతున్న ఒకేవొక్క ఆశ!

ఎవరికైనా మంచి బతుకంటే ఆశ... బాధలంటే భయం సహజం!

''అన్నో... ఎంకటప్పయ్యని పోలీసులు పట్టకపోయిన్రు'' జోతిబాయి రాంపాసి దాపుగా వచ్చి ఆనందంగా అంది.

''ఎప్పుడు?'' రాంపాసి

''పొద్దాలనే. నువ్వటు పొయిన కూసేపటికి''

ఎందుకో అతనికి తెలుసు. వెంకటప్పయ్య ఏడాది క్రితం, సింగరేణిలో కొలువిప్పిస్తానని ఆ వీధిలో ఉండే ఎనిమిదిమంది దగ్గర ముప్పయివేల చొప్పున తీసుకొన్నాడు. రేపూ, మాపూ అంటూ రోజులు గడుపుతుంటే, పదిరోజుల క్రితం బాధితులంతా చేరి, అంబేద్కర్ సెంటర్‌లో దొరికించుకొని హూనం చేశారు. వారం రోజుల్లో వడ్డీతో సహా చెల్లిస్తానని నోటు రాయించుకొన్నారు.

యువత అవసరాల్ని గుర్తించి, ఉద్యోగాల పేరుతో మోసగించే వెంకటప్పయ్య లాంటి వ్యక్తులు ఊరూరా తిరుగుతూ, అమాయకుల్ని ప్రలోభాల పాల్జేసి పబ్బం గడుపుకొంటున్నారు. నిరుద్యోగుల్ని మాయమాటలతో నమ్మించి లక్షలార్జించి, ఉడాయంచే ఏజన్సీలూ, కన్సల్టెన్సీలూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

''అయితె మాన్లె. నువ్ గమ్మునుండు. ఎవుడెట్ట సత్తె మనకెందుకు?'' తుల్సీబాయి బిడ్డను గద్దింపు స్వరంతో మందలిస్తుంటే. రాంపాసి తల్లికేసి చూశాడు. ఆ చూపును అందిపుచ్చుకొని, ''పయిటేల ఏవన్నా తిన్నవా కొడకా?'' అందామె.

రాంపాసి తినలేదు. తల దించుకొని, తిన్నట్టుగా తలూపాడు.

వసారాలో వున్న లాల్‌పాసి, కొడుకు – 'పని' గురించి తల్లికి ఏం చెపుతాడో విందామని చెవులు రిక్కించి చూస్తున్నాడు. తుల్సీబాయి గొంతులో నొక్కిపట్టి ఉంచుకొన్న ప్రశ్నను, రాంపాసి అన్న తినేంతవరకు ఆగి, చేయి కడుక్కొంటుంటే సంధించింది.

''పనేవయినా లంకించుకొన్నవా కొడకా?''

''ప్చ్...''

రాంపాసి నుంచి వెలువడిన ఆ శబ్దం లాల్‌పాసి గుండెల్లో ప్రతిధ్వనించింది. అతని మొహం మాడిపోయినట్టయింది. నిస్పృహగా నిట్టూర్చాడు. వెనక్కి, గోడకు చేరగిలబడి, ''ఉద్యోగాల్లేకా, పనులూ దొరక్క, ఈకాలపు పిలగాళ్లు బతికేదెట్టనో... పిచ్చిబట్టి రోడ్లెంట తిరుగుతూ తెగించిపోతున్రు. తప్పుడు దారుల్లోని సీకటి ఎవారాలకీ ఎగబడుతున్రు... యిట్టయితెట్ట?'' .. అలా... అలా... అతని ఆలోచనా స్రవంతి సాగుతూ, సాగుతూ... అలానే కునుకులోకి జారుకొన్నాడు.

గుడిసెలో ఉన్న తుల్సీబాయి కూడా కళ్లు మూసుకుందే తప్ప, నిద్రపోవడం లేదు. కొడుకు బతుకెలా సాగుతుందో తెలీక, కలవరంతో కదిలిపోతుందామె! ఉద్యోగంకోసం వాడి బాధలేవో వాడు పడుతుంటే, గత ఆరు నెలలుగా పోలీసులు ఏవేవో అనుమానాలతో వెన్నాడుతూ... అర్ధరాత్రీ, అపరాత్రీ లేకుండా వచ్చి ఆరాతీస్తూ, బెదిరిస్తున్నందున – ఏరోజు ఏమవుతుందోననే ఆందోళనతో ఆవేదన పాలవుతుందామె.

రాంపాసి కూడా కళ్లు మూసుకున్నాడుగాని, అతని పరిస్థితీ అలానే వుంది. కొన్ని నెలలుగా అతను వ్యవస్థ మీద ఏర్పరచుకొన్న అభిప్రాయాల్ని మూల్యాంకనం చేసుకునే కొలది 'అతని కసి' మరింతగా బలపడుతోంది. సమాజంతో ముడిపడిన వ్యక్తి జీవితం – సమాజ ఉన్నతీకరణతోపాటు పుష్టిస్తుందే తప్ప, నాయకుల చుట్టో ఉద్యోగాల కొరకో తిరిగితే కాదని నిర్ణయానికొచ్చాడు. మంచంలోంచి లేచి తల్లినీ, చెల్లినీ గమనించాడు. గుడ్డి దీపపు వెలుగులో వారి మొహాల్లో కనిపించే పేదరికపు నీడలు చూస్తూ, అసహనంతో, ఏదో గుణించుకుంటూ అటూఇటూ తిరుగుతుంటే...

ఓరకంట గమనించిన తల్లి, భయపడుతూ లేచి, కూచొని, ''ఏంది, కొడకా... నిద్రపట్టడం లేదా?'' అంది.

రాంపాసి తల్లి దాపుగా కూచొని, ఆమె వడిలో తల పెట్టి ''అమ్మా... అమ్మా...'' అంటూ చేతులు పట్టుకొని గోముగా నిమురుతూ –

తుల్సీబాయికి కొడుకు స్వరం కొత్తగా అన్పించింది. ఏదో... తెలీని భయంతో ఆమె మనసు ఊగిసలాడింది. ''ఏంది కొడకా, భయపడతన్నవా... కలేమైనొచ్చిందా?'' వీపు నిమురుతూ, అయోమయంగా అంది.

''నాకుద్యోగం దొరకదమ్మా.. మీకింత తిండిపెట్టే భాగ్యం నాకు లేదమ్మా..''

తుల్సాబాయి గుండెల్ని పిరికిడబట్టి పిండుతున్నట్టుగా వణికిపోయింది. అయినా కొడుకు మరింత డీలాపడిపోతాడని, బయటపడకుండా, ''లేదు కొడకా... ఉద్యోగం దొరుకుతుంది... తెల్లారగట్ల సీకటి సిక్కంగుంటదని నీకు సుత తెల్వదా''

''తెలుసమ్మా... ఇంకా చాలా తెలుసు...''

''అందుకే గుండె చెదరమాకా''.

''ఈ గుండె మొండిదైపోయిందమ్మా... ఇక చెదరదూ... బెదరదూ...''

తుల్సీబాయి కొడుక్కేసి బాధగా, భయంగా చూసింది... ''అట్టనకు కొడకా... ఎట్ట రాసుంటే అట్టనే జరుగుతద్ది. లోకంల మనవొక్కళ్లమేనా? ... మనలా బాధలు పడేటోళ్లు శానామందుండరు'' అంది.

''ఉన్నారమ్మా... దేశం నిండా పేదలున్నారు. అయితే ఆ పేదలు – పేదలుగానే ఉంటున్నారు గదమ్మా... అయితే...''

జీప్ హారన్!... కీచుమంటూ ఆగిన శబ్దం!

రాంపాసి, దిగ్గున లేచి, ''పోలీసులమ్మా..'' అన్నాడు.

''అయితె మాల్లె... నువ్ గమ్మున పడుకో... నేనూ, మియ్య బయట అరుగు మీద కూకుంటం'' అని తలుపు తీసుకొని ''ఉన్నవా... ఏం జేస్తన్నవ్?'' అంటూ బయటికొచ్చింది తుల్సీబాయి.

జోతీబాయి పొయ్యి ముందర కుప్పగా కన్పించిన కాగితం ముక్కల్ని తీసి చూసింది. అవన్నీ తన అన్న రాంపాసి విద్యాయోగ్యతా పత్రాలు! ఊహల ఉయ్యాలపై అతన్ని ఊరించీ, ఊగించీ... ఊహకందని రీతిలో బోల్తా కొట్టించిన సర్టిఫికెట్లు! లాల్‌పాసి రక్తమూ, కన్నీళ్లూ కలగలిసిన ఫలాలు! ఎందుకూ ఉపయోగపడని రీతిలో ముక్కలు ముక్కలుగా పడి వున్నాయి!

''దా... కూకో... ఇప్పుడే పోలీసోళ్ల సందడికి తెలివొచ్చింది'' అన్నాడు లాల్‌పాసి.

పోలీసులు లాఠీలతో చప్పుడు చేస్తూ ఇల్లిల్లూ గాలిస్తున్నారు. కొద్దికాలంగా యిలా అర్ధరాత్రి వచ్చి నానాహంగామా చేసిపోవడం వారి వృత్తి ధర్మంగా మారిపోయింది.

''ఈ పోలీసోళ్లకి నిద్రపట్టదా? నడిజాము కాడ తిరుగుతుంటరు''.

''వాళ్ల సేసే పనే అది''

''ఏది, గుడిసెల్ల గుర్రుపెట్టే పోరల్లని గుంజకపోయి సావఁగొట్టటవా?''

''అందరి జోలికెందుకస్తరు? అనువానవున్నోడ్నే''

''ఏందనువానం! పనికోసం తిరిగొచ్చే పిల్లగాణ్ణి టేసనల కూకోబెట్టి, కీళ్లు వాయగొట్టటవాఁ!... ఆడి కాళ్లు వాసినయ్, సూసినవాఁ?''

''ఆడి కాళ్ళేగాదు, ఏడ్సేడ్సి నా కళ్లూ వాసినయ్... గమ్మునుండు, పోలీసోళ్లు యిటొస్తన్రు''.

''రానీ, ఏం బయవాఁ... కొడుకు పండిండు గదూ!... కావాలంటే సూస్కొమ్మను'' నెమ్మదిగా అని, దాదాపుగా వచ్చే పోలీసుల్ని చూస్తూ నిలుచుంది.

లాల్‌పాసి కూడా అరుగు దిగి నిల్చొని, దండం పెట్టాడు.

పోలీసులిద్దరూ దగరగా వచ్చారు. రోజూ వచ్చే వాళ్లే! ''క్యా... లాల్‌పాసీ, బాగున్నవ్.. ఉండా రాంపాసి?'' అన్నాడో పోలీస్.

''ఉండక, ఎటు పోతడు దొరా... ఆర్నెల్లసంది సూస్తన్న, రోజూ రావటం, ఆడి ఆరా తీయడం! ఎందుకు దొరా... ఆడేం జేసిండు?... ఆడేవన్న దొంగోడా... మీలాగనే చదివిండు. ఆడి కరమగాలి ఉజ్జోగం దొరకలె... లేకుంటెనా...'' అన్నాడు లాల్‌పాసి.

''రేయ్, చుప్... శాన మాట్లాడ్తన్నవ్... మాకన్నీ తెలుసు... మీవోణ్ణి బయట తిరగొద్దను. సంఝే...'' మరో పోలీస్ అని, లాఠీతో పందిరి గుంజను రెండు సార్లు కొట్టి వెనుదిరిగారిద్దరూ.

జీప్ దగ్గర ముగ్గురు పోలీసులు హడావుడి చేస్తున్నారు. ఒకతను పక్క గుడిసెలో నిద్రపోతున్న మునెయ్య కొడుకుని బలవంతంగా నిద్రలేపి, జీప్ దగ్గరకు లాక్కుపోతూ, ఈడ్చి తన్నాడు.

తుల్సీబాయి గుండెలు బాధగా మూలిగాయి.

''ఏం జేస్తం. కాని కాలవఁయింది'' అని, లాల్‌పాసి అరుగు మీదకు చేరి, ''పో.. పడుకో..'' అన్నాడు భార్యతో.

తుల్సీబాయి గుడిసె తలుపు తీసి, గుడ్డి దీపపు వెలుగులో అటూఇటూ చూసింది. వెనుక తలుపు తెరిచి వుంది.

మంచం ఖాళీగా వుంది.

తుల్సీబాయి కంగారుగా గుడిసె వెనక చూసింది. ఆమెలో భయం ముడగేసింది. ''ఏవఁయ్యోయ్... పిలగాడేడీ?'' అంది.

''ఆఁ'' అంటూ లాల్‌పాసి గుడిసెలోకి వచ్చాడు. జోతీబాయి – తల్లి అరుపునకు దిగ్గున లేచింది. అంతా తలపక్క వెతికారు.

రాంపాసి కనిపించలేదు.

మంచం కోడుకు తగిలించిన సంచి లేదు.... దండెం మీద వున్న రాంపాసి జత బట్టలూ లేవు.

దంపతులిద్దరూ తేలగుడ్లేసుక ఒకర్నొకరు చూసుకొన్నారు. జోతీబాయి నిశ్శబ్దంగా నిలుచుంది.

లాల్‌పాసి దుఃఖం ఆగలేదు.

నేలమీద కూలబడి, గొంతు పెగలకుండా నోటిలో పవిట చెంగు కుక్కుకొని తల బాదుకుంటూ కుమిలికుమిలి ఏడ్చే భార్య దగ్గరగా కూచొని, పెదాలు బిగబట్టి వెక్కివెక్కి ఏడవసాగాడు.

జోతీబాయి పొయ్యి ముందర కుప్పగా కన్పించిన కాగితం ముక్కల్ని తీసి చూసింది. అవన్నీ తన అన్న రాంపాసి విద్యాయోగ్యతా పత్రాలు! ఊహల ఉయ్యాలపై అతన్ని ఊరించీ, ఊగించీ... ఊహకందని రీతిలో బోల్తా కొట్టించిన సర్టిఫికెట్లు! లాల్‌పాసి రక్తమూ, కన్నీళ్లూ కలగలిసిన ఫలాలు! ఎందుకూ ఉపయోగపడని రీతిలో ముక్కలు ముక్కలుగా పడి వున్నాయి!

జోతీబాయికి అంతా అవగతమైంది. అయినా నోరు విప్పలేదు.

చాలాసేపటికి, లాల్‌పాసి ఏడుపాపి, కళ్లు తుడుచుకొని, భార్య కన్నీళ్లూ తుడుస్తూ, ''దార్లో ఆకలయితే ఏదైనా కొనుక్కోటానికి వాడి దగ్గర డబ్బేమఁయినా ఉందా?...'' అన్నాడు నెమ్మదిగా.

తుల్సీబాయి తెలీదన్నట్టుగా పెదవి విరిచింది. బిడ్డకేసి చూసింది.

జోతీబాయి పెదవి విప్పలేదు!

★